క్లుప్తంగా

నగరంలోని హోటళ్ల తనిఖీ



సేకరించిన చికెన్ పదార్థాల శాంపిల్స్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ఎంఎస్ఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న హోటల్‌ను శుక్రవారం చిత్తూరు ఆహార తనిఖీ అధికారి నాగేంద్రబాబు తనిఖీ చేశారు. హోటల్‌ని కిచెన్ సెక్షన్, అక్కడ ఉన్న వస్తువులను పరిశీలించారు. వస్తువుల నిల్వ, పరిశుభ్రత తదితర అంశాలను చూశారు. ఆహార పదార్థాలు ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారు. వాడకం, నిల్వ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికెన్ దమ్ బిర్యానీ, తందూరి చికెన్ శాంపిల్స్‌ను 4 ప్యాకెట్లను సేకరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించమని ఆహార తనిఖీ అధికారి తెలిపారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి, రిపోర్టు వచ్చాక తరువాత చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7నుంచి 10గంటలకు శిబిరం జరుగుతుందన్నారు. అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు చేసి ఆపరేషన్‌కు ఎంపిక చేస్తారన్నారు.

ఎస్టీఓ హరిప్రసాద్‌కు సన్మానం



ఎస్టీఓను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

బంగారుపాళెం: స్థానిక ఉప ఖజానా అధికారి(ఎస్టీఓ) హరిప్రసాద్‌ను శుక్రవారం సాయంత్రం ఏపీ గ్రేడ్–2 హెచ్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్టీఓ హరిప్రసాద్ ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందుతున్న సందరభంగా ఈ సంఘం 5వ జోన్ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు హెచ్‌ఎంలు గిరిరాజా, బేరీనాథ్, చిట్టెమ్మ, విశ్రాంత హెచ్‌ఎం పార్థసారధి, కార్యాలయ సిబ్బంది సన్మానం చేశారు.

నట్టల నివారణ మందులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో శుక్రవారం పశు సంవర్థకశాఖ సిబ్బంది నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పశు సహాయక సిబ్బంది పాడిరైతుల వారీగా మేకలు, గొర్రెలను గుర్తించి నివారణ మందులు తాగించారు. 200 గొర్రెలు, 150 మేకలకు నివారణ మందులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు

యాదమరి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ విద్యార్థినులకు రక్తపరీక్షలు నిర్వహించారు. 70 మంది విద్యార్థినులకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థినులకు విటమిన్, కాల్షియం మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, శాంతమ్మ, భానుప్రియ, సరస్వతి, సురేందర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం 12,836 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు విరాళంగా రూ.1.42 లక్షలు సమర్పించుకున్నారు. అన్నదానం ట్రస్టుకు రూ.76,423, గోసంరక్షణ ట్రస్టుకు రూ.53,216, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.5.87 లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఔషధాల నేరేడు



కొమ్మనిండా కాసిన అల్ల నేరేడు పండ్లు

- సర్వరోగ నివారిణి
- కాయ నుంచి బెరడు వరకు ఔషధమే
- మార్కెట్‌లో డిమాండ్

ఐరాల: ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే అల్ల నేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి, ఔషధ విలువలు, పోషకాలు ఇచ్చే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. తినడానికి ఇవి కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉంటాయి. జంబూఫలం, జామూన్‌గా కూడా పిలుస్తారు. నేరేడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా పిలుస్తారు. ఆక్సాలిన్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది. ఈ పండు శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అత్యధిక పోషకాలు ఉన్న నేరేడును పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్, తదితరాల రూపంలోనూ తీసుకోవచ్చు. నేరేడు కాయలను వెనిగర్, వైన్ తయారీలోనూ ఉపయోగిస్తారు.

ధర కాస్త అధికమే

నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అధికంగానే ఉంటుంది. ప్రస్తుతం రైతు దగ్గర దళారులు కిలో రూ.50 నుంచి రూ.70కు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.90 నుంచి రూ.110కు విక్రయిస్తున్నారు. వినియోగదారుల చేతికొచ్చేసరికి రూ.130 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరుచేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది.

విటమిన్లు పుష్కలం

నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతోపాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలోని ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలాను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు. చెట్లు ఆకులు కూడా విషాన్ని పీల్చుకొనే గుణాన్ని కలిగి ఉంటాయి. పొట్టలో ఉండే నులిపురుగులును ఈ నేరేడు పండు నివారిస్తుంది. నోటి క్యాన్సర్ నివారణకు కూడా ఎంతో దోహదపడుతుంది. మధుమేహ వ్యాధి పీడితులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడి చేసుకొని ప్రతి రోజు వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపుతో ఉంటాయి. అతిసార రోగులకు సైతం ఈ పండ్లు చాలా మంచి ఔషధం. ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం 20 పండ్లు తింటే మంచి ఫలితాలుంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అల్ల నేరేడు పండ్లు



మంచి డిమాండ్

ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు, రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పండ్లలో ఔషధ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు బీపీ, షుగర్ వంటి జబ్బులను తగ్గించేందుకు దోహదపడుతాయి. అందుకే నేరేడు పండ్లను ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రలోని జెండామాను వీధి, వారపు సంత, కూరగాయల దుకాణం, తదితర ప్రాంతాల్లో బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.



ఆరోగ్యానికి మంచిది

కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. వర్షాకాలం ప్రారంభ సమయంలో వచ్చే నేరేడు పండ్లను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పండుకు విషాన్ని హరించే శక్తి సైతం ఉంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

–పూర్ణలత, డాక్టర్, ఐరాల



ఉద్యోగుల దీక్షకు వైఎస్సార్‌సీపీ మద్దతు




కార్మికుల దీక్షకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం మునిసిపల్ కార్మికులను సైతం మోసం చేసి పబ్బం గడుపుకుంటోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు కార్పొరేషన్ ఇన్‌చార్జ్ హరిణిరెడ్డి దుయ్యబట్టారు. గత ఐదు రోజులు మునిసిపల్ కార్మికులు సమ్మెబాట పడితే ప్రభుత్వానికి ఏమాత్రం లెక్కలేదన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న దీక్షకు వైఎస్సార్‌సీపీ నేతలు సంఘీభావం ప్రకటించి, కార్మికులకు మద్దతు ప్రకటించారు. హరిణిరెడ్డి మాట్లాడుతూ కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో మునిసిపల్ ఉద్యోగులు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం, ప్రోత్సాహకాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం మంచిది కాదన్నారు. వెంటనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. కార్మిక సంఘ నాయకులు శరవణ మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఇంటి అద్దె, పింఛను ఇవ్వడంతోపాటు విధి నిర్వహణలో కార్మికులు మృతి చెందితే రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందితే రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం, కుటుంబలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం లాంటి కనీస కోర్కెలను ప్రభుత్వం తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు పుష్పలత, షర్మిల, మధుబాబు రెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, పూమణి, పార్టీ నేతలు నారాయణమూర్తి, ఆను, మనోహర్‌రెడ్డి, వేమారెడ్డి, మధు.. కార్మిక సంఘ నాయకులు శివకుమార్, శివప్రసాద్, వెంకటేష్, హరికృష్ణ, సునీల్ కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఈ తుక్కును ఏం చేస్తారో..?

ఇది చిత్తూరు నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న పాత ఇనుప తుక్కు తీసుకెళుతున్న వాహనం. నాలుగు రోజుల క్రితం పోలీసులు ఈ వాహనంలోని రూ.లక్షలు విలువచేసే తుక్కుకు ఎలాంటి బిల్లులు లేవని సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం వాణిజ్య పన్నులశాఖ అధికారులకు ఈ కేసును అప్పగించాలి. పోలీసులు అందించిన పంచనామా సరిగాలేదని, సరైన పద్ధతిలో కేసు వివరాలు ఇవ్వలేదని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. ఓవర్ లోడ్ అయితే రవాణా శాఖ అధికారులకు అప్పగించాలి. ఆ పని కూడా చేయలేదు. కేవలం ఓ ప్రజాప్రతినిధికి 'తుక్కు' వ్యాపారులు కప్పం కట్టలేదనే సాకుతో, వ్యాపారులను దారిలోకి తెచ్చుకోవడానికి ఖాకీలు ఇలా చేస్తున్నారన్న చర్చ మొదలైంది. మరి వాస్తవాలు ఏంటో..? రోజుల తరబడి వాహనం స్టేషన్ ముందు ఎందుకు పెట్టుకున్నారో..? వాహనం సీజ్ చేసిన వెంటనే కాకుండా, 24 గంటల తరువాత చర్యలకు ఎందుకు ఉపక్రమించారో..? వాణిజ్య పన్నులశాఖ అధికారులకు సక్రమంగా రికార్డులు ఎందుకు ఇవ్వలేదో..? అనే ప్రశ్నలకు దర్యాప్తు అధికారి మౌనమే సమాధానం.

–చిత్తూరు అర్బన్





చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట సీజ్ చేసిన తుక్కు తరలించే వాహనం

సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ బాధ్యతల స్వీకరణ



డీఈఓకు పత్రం అందజేస్తున్న రవిశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : డీఈవో కార్యాలయ నూతన సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈవో వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి నియామక ఉత్తర్వులను అందజేశారు. సూపరింటెండెంట్‌తో డీఈవో మాట్లాడుతూ, బాధ్యతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇచ్చే కసరత్తు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా విధులు నిర్వర్తించాలన్నారు ఆయనకు కార్యాలయంలోని సహచర సూపరింటెండెంట్లు స్వర్ణలత, నందకుమార్, రమేష్, ఇతర సిబ్బంది మురళి, గోపాల్, సాయి, ఆనంద్, జయప్రకాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ల్యాబ్ ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అపోలో యూనివర్సిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం వైస్ చాన్సలర్ వినోద్ భట్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, యూనివర్సిటీలో సాంకేతిక విద్యను మరింత మెరుగుపరచడం, విద్యార్థులకు ఆధునాతన సాంకేతికతను అందించడంలో ఈ ల్యాబ్ కొత్త అధ్యయనానికి నాంది పలుకుతుందని చెప్పారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, సీఈఓ శంకర్‌బాబు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. 2025–25 ఆర్థిక సంవత్సర బ్యాంకు ఆడిట్ సర్టిఫికెట్‌ను ఆమోదించారు. సహకార సంఘాలకు రూ.76 లక్షలు డివిడెంట్ ఇవ్వాలని, సంఘ బలోపేతానికి అన్ని రకాల రుణాలు మంజూరు చేయాలని, ముందస్తు ప్రణాళికలు తయారీ చేసి అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తూ ఉన్న ఖాళీలను భర్తీ చేయుటకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆమోదించారు. 2024–25కు బ్యాంకు లాభం రూ.5.10 కోట్లు, నికర ఆస్తులు 1.92 శాతం, డిపాజిట్లు రూ.998.84కోట్లు, రుణాలు రూ.2436.50 కోట్లతో ప్రగతి కనబరిచినట్లు సీఈఓ వెల్లడించారు. జిల్లా సహకార అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయం శూన్యం?

అధికారంలోకి రావాలన్న తపనతో కూటమి నాయకులు అమలు సాధ్యం కాని హామీలు గుప్పించారు. పాలన పగ్గాలు చేపట్టిన తరువాత రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరు మార్చారు. ఏడాది గడిచినా రైతులకు ఒక్క రూపాయి కూడా విదిల్చిన పాపాన పోలేదు. సంవత్సరానికి రూ.20వేలు సాయం చేస్తామని చెప్పి అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. పథకం అమలులో స్పష్టత కొరవడింది. ఖరీఫ్ పంటల సాగుకు కర్షకుల వద్ద సొమ్ములు లేక అప్పులు చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు మొండిచెయ్యి
- అదును దాటిపోతున్నా అందని సుఖీభవ
- గతంలో సకాలంలో భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చిల్లిగవ్వ లేక అప్పుల కోసం అన్నదాతల పాట్లు



దుక్కి దున్నుతున్న రైతు

గుడిపాల: కూటమి నాయకుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. ఖరీఫ్ సాగు మొదలుకాక ముందే ఏడాది క్రితం వరకు ఐదేళ్ల పాటు పంటల సాగు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేయడంతో వ్యవసాయం పండగలా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. ఇప్పటివరకు కనీసం సాయం చేయకపోవడంతో ప్రస్తుతం పంటల సాగుకు చేతిలో నగదు లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారమే పరమావధిగా.. అలవిగాని హామీలిచ్చి .. ప్రస్తుతం వాటిని అమలు చేయలేక పీట్లు వేస్తున్నారు. ముందస్తుగా కురిసిన వానలకు రైతులు ఖరీఫ్ ముందస్తు సాగుకు పూనుకున్నారు. మండలంలో ఈ సీజన్‌లో 10వేల ఎకరాలకు గాను.. 2,200 ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

అదిగో... ఇదిగో..

పేరు మార్చిన అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడంలో ప్రభుత్వానికి స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడాన్ని చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. ఈ నెల 20వ తేదీన అని ఒకరు, కాదు 21వ తేదీన అని సీఎం చంద్రబాబు పలుమార్లు ప్రకటించినప్పటికీ 26వ తేదీ గడిచినా రైతుల ఖాతాల్లో పథకం సొమ్ము జమ కాలేదు. అసలు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా అన్న సమాచారం కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడం, అంతంత మాత్రంగానే పంటలు రావడంతో కర్షకుల చేతిలో చిల్లిగవ్వ లేక పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

కౌలు రైతులకు దక్కని భరోసా

భూమిలేని రైతులు కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవీ అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

గతంలో సకాలంలో భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం కింద ఏటా సకాలంలో ఆర్థికసాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు మార్చి గాలికి వదిలేసింది. ఇప్పటివరకు ఏడాది గడిచినా సాయం మాత్రం శూన్యం. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేది. కూటమి పెద్దలు ఎన్నికల ముందు రూ.20వేలు అందజేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాన్ని పక్కన పెట్టేశారు.



రైతు భరోసా కేంద్రం

మెరుగైన సరఫరాకు కృషి

చిత్తూరు కార్పొరేషన్: మెరుగైన విద్యుత్ సరఫరాను అందించడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ ఈఈ సురేష్ తెలిపారు. పలు అంశాలపై ఆయన ఈఈ కార్యాలయంలో మాట్లాడారు. ఆవులకొండలోని సబ్‌స్టేషన్‌లో కోటి విలువతో 8 ఎంవీఏ సామర్థ్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పాలసముద్రం సబ్‌స్టేషన్‌లో అమర్చామన్నారు. వీటి ద్వారా వ్యవసాయానికి మెరుగైన సరఫరా వస్తుందన్నారు. కార్వేటినగరం మండలం అనూర్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం(ఎస్‌పీఎం) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పనులు పూర్తయ్యాక కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, పచ్చికపురం, నగరి ప్రాంతాల రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను అక్కడే చేసుకోవచ్చని చిత్తూరుకు రావాల్సిన అవసరం లేదన్నారు. భద్రత వారోత్సవాల సందర్భంగా సబ్‌స్టేషన్లలో ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.